క్లుప్తంగా

నేడు నీటి సరఫరా బంద్

భైంసాటౌన్: పట్టణంలో బుధవారం నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. కుంట ప్రాంతంలో మరమ్మతుల నేపథ్యంలో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని.. పట్టణవాసులు సహకరించాలని కోరారు.

ఎల్లమ్మ బోనాలు



బోనాలతో భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాజుల్‌పేట్ కాలనీలో మంగళవారం రేణుక ఎల్లమ్మ బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దొంతుల రవి, మడిగేల ఇస్తారి, కిషన్‌సింగ్, గంగన్న, భీమన్న, సురేందర్, రాజన్న ,కిషన్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హుస్సేనప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరంలో బీఎస్సీ(బీజెడ్‌సీ), ఎంపీసీ, బీకాం, బీఏ, బీఎస్సీ(ఎంపీసీఎస్) గ్రూపులు అందుబాటులో ఉన్నాయని.. విద్యార్థులు నేరుగా జిల్లా కేంద్రంలోని డీసీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

గురుకులంలో..

ముథోల్: స్థానిక ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో ప్రవేశానికి ఈనెల 15 వరకు దరఖాస్తు చేసుకో వాలని ప్రిన్సిపాల్ రఫీవోద్దిన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని.. ఎంపిక జాబితాను 18న విడుదల చేస్తామన్నారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి



ఎల్విలో పరిశీలిస్తున్న డీఈ చందు

తానూరు: మనఊరు–మనబడిలో భాగంగా ఎంపికైన పాఠశాలల్లో పనులు సత్వరం పూర్తి చేయాలని పీఆర్ డీఈ జాదవ్ చందు అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. మండలంలోని పాఠశాలల్లో కొనసాగుతున్న పనుల వివరాలను పీఆర్ ఏఈ జగదీశ్‌ను అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తి చేసిన వారికి సకాలంలో బిల్లులు చెల్లిస్తామన్నారు. వారి వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ


తానూరు: మండల కేంద్రంలోని ఆయా వీధుల్లో మంగళవారం విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాకాలంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీవో సుభాశ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	100
వంకాయ	70
బెండకాయ	70
పచ్చిమిర్చి	120
కాకరకాయ	100
బీరకాయ	110
క్యారెట్	120
గోరుచిక్కుడు	50
కొత్తిమీర	120
అల్లం	200
ఎల్లిగడ్డ	140
ఉల్లిగడ్డ	30
ఆలుగడ్డ	40

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : రంగబలి

నారాయణ : సామజవరగమన

హరితహారానికి సమాయత్తం!

- క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ప్రతి గ్రామంలో 10వేల మొక్కలు పెంచుతున్న అధికారులు



నర్సాపూర్(జి) నర్సరీలో సిద్ధంగా మొక్కలు

నర్సాపూర్(జి): ఆకుపచ్చ తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ఏటా యజ్ఞంలా కొనసాగిస్తోంది. అధికారులు పంచాయతీకో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలు పెంచి సంరక్షిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతీ నర్సరీ లో 10 వేల చొప్పున మొక్కలు పెంచుతున్నారు.వర్షాకాలం ప్రారంభమైనందున తొమ్మిదో విడత హరితహారంలో మొక్కలు నాటేందుకు కసరత్తు చేస్తున్నారు.

మండలంలో 2.30 లక్షల మొక్కలు..

నర్సాపూర్(జి) మండలంలోని 13 గ్రామపంచాయతీ నర్సరీల్లో 10 వేల చొప్పున 1.30 లక్షల మొక్కలతో పాటు అదనంగా మండలకేంద్రంలోని అటవీశాఖ నర్సరీలో మరో ఒక లక్ష మొక్కలను పెంచుతున్నారు. ఇప్పటికే మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వి సిద్ధంగా ఉంచారు.

అన్ని రకాల మొక్కలకు ప్రాధాన్యత....

నర్సరీలో అన్ని రకాల మొక్కలు పెంచేందుకు ప్రాధాన్యమిచ్చారు. పండ్ల మొక్కలు మామిడి, జామ, బొప్పాయి, దానిమ్మ, సపోటా, పూల మొక్కలు మందారం, గన్నేరు, గులాబీ, పచ్చగన్నేరు, మల్లె, నీడనిచ్చే మొక్కలు వేప, చింత, రావి, కానుగ, మర్రి తదితర మొక్కలను పెంచుతున్నారు. ఇంటి పరిసరాలు, గ్రామ అంతర్గత రోడ్లు, అవెన్యూ ప్లాంటేషన్, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పొలం గట్లు, చెరువు శిఖం, అటవీ భూముల్లో నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో....

ఈనెల14న నర్సాపూర్(జి) అటవీ ప్రాంతంలో 11,111 మొక్కలను ఒకేసారి నాటేందుకు భూమిని చదును చేసి గుంతలను తవ్విస్తున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. అల్లనేరేడు, వేప, రావి, మర్రి, జీడి, ఉసిరి, వెలగ, నెమలినార, చింత, మోదుగ, నరేప, జిట్రేగి మొక్కలు నాటనున్నట్లు పేర్కొన్నారు.

అందరూ భాగస్వాములవ్వాలి



తొమ్మిదో విడత హరితహారం కోసం మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించాం. ఇప్పటికే నర్సరీలో అన్ని మొక్కలు సిద్ధమయ్యాయి. అందరూ భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. – వనజ, ఎంపీడీఓ

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

- డీఎంహెచ్‌వో ధనరాజ్



వానల్‌పాడ్‌లో నిల్వ నీటిని తొలగింపజేస్తున్న డీఎంహెచ్‌ఓ ధనరాజ్



పనులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సుధీర్‌కుమార్

భైంసారూరల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని డీఎంహెచ్‌వో ధనరాజ్ అన్నారు. డ్రైడేలో భాగంగా మంగళవారం మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో పర్యటించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దరిచేరవన్నారు. గ్రామాల్లోని వార్డుల్లో ప్రజలకు వ్యక్తి గత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల ముందు ఉన్న కుండీల్లో నీరు నిల్వ ఉండకుండా తొలగింపజేశారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయన వెంట వైద్య సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

సోన్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కడ్తాల్ పంచాయతీ పరిధిలో డ్రై డే నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. వారంలో ఒకరోజు తప్పనిసరిగా పరిసరాలను శుభ్రం చేసుకుంటే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉంటామన్నారు. ఎంపీవో ఖలీల్ హైమద్, కార్యదర్శి తస్కీన్, రాజనర్సయ్య, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, కార్మికులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'



మాట్లాడుతున్న దుర్గాభవాని

నిర్మల్‌చైన్‌గేట్: వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గాభవాని అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలను మభ్యపెడుతూ అధికారంలోకి వచ్చారన్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని అధికారంలోకి వచ్చి తన కుటుంబాన్ని బంగారు కుటుంబంగా మార్చుకున్నాడన్నారు. అవినీతి ప్రభుత్వాన్ని గద్దెదించడానికి రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రజల్లోకి వెళ్తామన్నారు. కార్యక్రమంలో మహిళా కార్యదర్శి గంగామణి, ఉపాధ్యక్షురాలు మరెంపెల్లి పద్మ పాల్గొన్నారు.

'రేవంత్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి'

కుంటాల: తెలంగాణ రైతులను అవమానించేలా వాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంటవార్ దశరథ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కల్లూర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని ఆయన పథకాలు, దేశానికే ఆదర్శనీయమన్నారు.

గరిటె తిప్పిన టీచర్లు



కుంటాలలో వంట చేస్తున్న ఉపాధ్యాయులు

కుంటాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పాఠాలు బోధించే ఉపాధ్యాయులు గరిటె పట్టి విద్యార్థుల ఆకలి తీర్చారు. మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో మంగళవారం విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉపాధ్యాయులే మధ్యాహ్న భోజనం తయారు చేసి.. 140 మంది విద్యార్థులకు వడ్డించారు.

'సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం'

ఖానాపూర్: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆరో రోజు నిరవధిక రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న పంచాయతీ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు, సిబ్బంది ఉన్నారు.

నర్సాపూర్(జి): తమ సమస్యలను పరిష్కరించాలని మంగళవారం మండలంలోని గ్రామపంచాయతీల కార్మికులు నిరవధిక సమ్మె బాట చేపట్టారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి



నర్సాపూర్(జి): కుస్లీలో దరఖాస్తు చేస్తున్న రైతులు

ముథోల్: రైతులు తప్పనిసరిగా రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో ప్రవీణ్ అన్నారు. మంగళవారం మండలంలోని బ్రాహ్మణ్‌గామ్ రైతువేదికలో అర్హుల నుంచి రైతుబీమా దరఖాస్తులు స్వీకరించారు. జూన్ 15లోపు పట్టాదారు పాస్‌పుస్తకాలు పొంది 18 నుంచి 59 ఏళ్లు కల్గిన రైతులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. రైతులు పాసుపుస్తకం, ఆధార్, నామినీ ఆధార్,దరఖాస్తును రైతువేదికలో ఏఈవోకు అందించాలన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మంగ్లారపు ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, నామినీ ఆధార్‌లతో ఏఈవోలను సంప్రదించాలని కోరారు.

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లీ, గొల్లమాడ గ్రామాల్లో మంగళవారం రైతుబీమా నమోదు కార్యక్రమాన్ని ఏఈఓలు భాగ్యలక్ష్మి, గణేశ్ ప్రారంభించారు. కొత్త పాస్‌పుస్తకం వచ్చినవారు రైతువేదికలో సంప్రదించాలని సూచించారు.

లోకేశ్వరం: అర్హులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకొవాలని ఏఈవో మౌనిక తెలిపారు. మండలంలోని బామ్నికేలో మంగళవారం పలువురి నుంచి రైతుబీమా దరఖాస్తులు స్వీకరించారు.

బురదలో కూరుకుపోయిన లారీ



ట్రాక్టర్‌తో లారీని బయటకు తీస్తున్న కార్మికులు



ఘాట్ ప్రదేశంలో బురదగా బీటీ రోడ్డు

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి(జి) గ్రామానికి వెళ్లే ఘాట్ రోడ్డు వర్షాల కారణంగా బురద మయమైంది. మంగళవారం ఆ గ్రామానికి రేషన్ బియ్యం లోడ్‌తో వెళ్లిన లారీ బురదలో కూరుకుపోయింది. దాంతో ట్రాక్టర్ సాయంతో లారీని బయటకు తీసి గ్రామానికి తరలించినట్లు రేషన్ డీలర్ రాథోడ్ అర్జున్ తెలిపారు. తరచుగా వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నామని.. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని బూరుగుపల్లి(జి)గ్రామస్తులు కోరుతున్నారు.

'ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలి'



మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: ప్రైవేటు పాఠశాలల్లో డొనేషన్ల పేరిట వసూలు చేస్తున్న అధిక ఫీజులను ప్రభుత్వం వెంటనే నియంత్రించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింగరి వెంకటేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి విద్యార్థి సంఘాల పిలుపు మేరకు ఈనెల 12న రాష్ట్రవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలన్నారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా.. విద్యారంగంలో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి జేవారే రాహుల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కైలాస్, నవీన్, తదితరులున్నారు.

వడ్డెరబంధు ప్రకటించాలి



మాట్లాడుతున్న అధ్యక్షుడు ప్రభాకర్

నర్సాపూర్(జి): రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర కులస్తులకు ప్రత్యేకంగా వడ్డెరబంధు ప్రకటించి ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సంపంగి ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. వడ్డెర సామాజిక వర్గం 1976 కంటే ముందు డీనోటిఫైడ్ ట్రైబ్స్‌లో ఉండేదన్నారు. అనంతరం బీసీ జాబితాలో కలపడంతో వడ్డెరలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దండుగుల సాయిలు, తమ్మిశెట్టి మారుతి, జుక్కన్న, నాగరాజు, శంకర్, రాములు, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రాయితీ గొర్రెలు పంపిణీ



గొర్రెలు అందిస్తున్న నాయకులు, అధికారులు

సారంగపూర్: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న గొర్రెలను పోషించుకుని గొల్ల, కుర్మలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని బోరిగాం గ్రామంలో 12 మంది లబ్దిదారులకు మంగళవారం గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. అన్ని కులవృత్తులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. వారి వెంట జిల్లా పశువైద్యాధికారి శంకర్, సర్పంచ్ రాజారెడ్డి, ఎంపీటీసీ సురేఖ, మాణిక్‌రెడ్డి, చందు, రాజ్‌మహ్మద్, రవీందర్‌రెడ్డి, అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పశువైద్యాధికారి ముక్తార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మొక్కలు పంపిణీ

సారంగపూర్: హరితహారంలో భాగంగా మండలంలోని ప్యారమూర్‌లో గ్రామస్తులకు పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలను ఎంపీపీ మహిపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని పోషకవనంలో కూరగాయల విత్తనాలు చల్లడంతో పాటు వంకాయ, మిరప మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ దివ్య, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏపీఓ లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

యువ పోరాటయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో ఈనెల 13న నిర్వహించే యువ పోరాట యాత్ర పోస్టర్‌ను మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు ఆవిష్కరించారు. ఈ యాత్రకు ముఖ్య అతిథిగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. నిర్మల్‌లోని చించోలి(బి) ఎక్స్‌రోడ్డు నుంచి ప్రారంభమై బైల్ బజార్, గాంధీచౌక్, పాతమార్కెట్ ప్రాంతం మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు యాత్ర చేరుకుంటుందన్నారు. కావున యువత పెద్దసంఖ్యలో తరలివచ్చి యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇమ్రాన్, జిల్లా ఇన్‌చార్జి మహమ్మద్ ఇషక్ షేరు, కాంగ్రెస్ నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజహర్, జునైద్, న్యాయవాది మల్లారెడ్డి, అర్షద్, ముక్తార్, షబ్బీర్ అలీపాష తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



ఖానాపూర్‌లో నిరసన తెలుపుతున్న కార్మికులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం ఎంఐఎస్ కోఆర్డినేటర్ నవీన్‌రెడ్డికి మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఈనెల 13లోగా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుంటే 14నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పలువురు కార్మికులు పాల్గొన్నారు.

తానూరు: తమ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం మండలాధ్యక్షులు భారత్‌బాయి, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: తమ బిల్లులు చెల్లించాలని కోరుతూ పట్టణంలోని ఎంఈవో కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం నిర్వహించే కలెక్టరేట్ ముట్టడికి తరలిరావాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, పద్మ, రాజవ్వ, రాజేశ్వర్ తదితరులున్నారు.

చిందు హక్కుల పోరాట సమితి కార్యవర్గం



నూతన కార్యవర్గం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో మంగళవారం చిందు హక్కుల పోరాట సమితి కమిటీ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో జిల్లా అధ్యక్షుడిగా పుల్లింటి సాగర్, ప్రధాన కార్యదర్శిగా గజ్జెల నర్సయ్య, ఉపాధ్యక్షులుగా చిరంజీవి, పరమేశ్వర్, సలహాదారుగా పెద్ద రాజేశ్వర్‌ను ఎన్నుకున్నారు. అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘ భవనానికి జిల్లా కేంద్రంలో 500 చదరపు గజాల స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆసుపత్రిలో పండ్లు పంపిణీ

ఖానాపూర్: తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ జన్మదినం సందర్భంగా మంగళవారం ఖానాపూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో బీజేపీ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకముందు స్థానిక జగన్నాథ్‌రావు చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పెంబి జెడ్పీటీసీ జానుబాయి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పడాల రాజశేఖర్, ఆకుల శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, గిరి, రవి, కిషన్, శ్రావణ్, రమేశ్, సుధాకర్, సాయి, వెంకటేశ్, శేఖర్, శ్రీధర్, సురేశ్ తదితరులున్నారు.

నేడు స్పాట్ అడ్మిషన్లు

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు బుధవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ధ్రువపత్రాలతో నేరుగా కళాశాలలో సంప్రదించాలని ఆయన కోరారు. ఇప్పటికే అడ్మిషన్ తీసుకున్నవారికి హాస్టల్ వసతి కల్పించామన్నారు. ఈ అడ్మిషన్లకు హాస్టల్ వసతి లేదని.. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు గమనించాలని ఆయన సూచించారు.

అటెన్షన్ ప్లీజ్.. బురద రోడ్డుపై నడిచేదెలా



లోకేశ్వరం: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని వట్టోలి గ్రామ సమీపంలోని మట్టి రోడ్డు బురదమయంగా మారింది. వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు మోకాళ్ల లోతు దిగబడే ఈ రోడ్డు లోంచి నడిచి వెళ్తూ ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై మొరం పోయించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రాములు, వట్టోలి గ్రామ కార్యదర్శి, ఫోన్: 70135 78627